క్లుప్తంగా

నూతన భవనంలో వైద్య సేవలు



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో నూతనంగా ప్రారంభించిన అర్బన్ హెల్త్ కేంద్రంలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రభుత్వ పట్టణ ఆసుపత్రి వైద్యుడు విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆధునిక వసతులతో ఆసుపత్రిలో రోగులకు అన్ని సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శరవేగంతో ప్రభుత్వ కార్యాలయ పనులు



శరవేగంగా సాగుతున్న నూతన ప్రభుత్వ కార్యాలయ భవనాల పనులు

సింహాద్రిపురం: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం, మండలపరిషత్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ నూతన భవనాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ భవనాలు శిథిల స్థితికి చేరుకోవడంతో ఉపమండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి అత్యాధునిక నూతన భవనాలు మంజూరు చేయించారు. నూతన ప్రభుత్వ కార్యాలయ సముదాయ భవనాల పనులు శరవేగంతో సాగుతూ చివరి దశకు చేరుకున్నాయి. దీంతో అటు అధికారులు, ఇటు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మిగిలిన కేసులపై విచారణ జరపాలి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సంబంధించి మిగిలిన కేసులపై కూడా సత్వరమే విచారణ జరపాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధన్నవాడ మహేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. చంద్రబాబు ఓటుకు నోటు కేసు, అమరావతి భూముల కుంభకోణం లాంటి పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారన్నారు. వాటిపై కూడా విచారణ చేపట్టాలన్నారు.

ఎస్పీని కలిసిన మైనింగ్ డైరెక్టర్

వీరపునాయునిపల్లె : జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సిద్దార్థ కౌశల్‌ను సోమవారం రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగారెడ్డి వీర ప్రతాప్‌రెడ్డి కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

అవార్డు గ్రహీతలకు ఘన సత్కారం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న జీసీటీఏ ప్రతినిధులు

వైవీయూ : ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన కడప ప్రభుత్వ పురుషుల కళాశాలకు చెందిన డా. పి. రవి శేఖర్, డా. బి. రామచంద్రలను ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జీసీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్. నీలయ్య, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, జీసీటీఏ జిల్లా అధ్యక్షుడు డా. శశికాంత్ రెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో జీసీటీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ఆమోదించాలి



రిలే దీక్షల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఇన్‌చార్జి శివయ్యలు మాట్లాడుతూ పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు మాతయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చిన్నసుబ్బయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనిపించని బంద్

- యథావిధిగా తిరిగిన ఆర్టీసీ బస్సులు
- తెరుచుకున్న దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు

పులివెందుల రూరల్ : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా సోమవారం టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపు పులివెందుల నియోజకవర్గంలో ఏమాత్రం ప్రభావం చూపలేదు. వ్యాపారులు దుకాణాలను తెరచుకుని వ్యాపారాలు కొనసాగించారు. కొంతమంది టీడీపీ నాయకులు ఆర్టీసీ బస్టాండు వద్దకు వెళ్లి బస్సు సర్వీసులు నడపవద్దని ఆర్టీసీ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. పులివెందులలో బంద్ కనిపించకపోవడంతో ఆర్టీసీ అధికారులు కూడా వివిధ ప్రాంతాలకు, గ్రామాలకు బస్సు సర్వీసులను యథావిధిగా కొనసాగించారు.

బలవంతంగా బంద్

సింహాద్రిపురం : మండల కేంద్రంలో టీడీపీ నాయకులు బలవంతంగా వ్యాపార సంస్థలను, పాఠశాలలను, బ్యాంకులను మూయించేశారు. దీంతో ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు.

లింగాల మండలంలో..

లింగాల : లింగాల మండలంలో బంద్ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసన కూడా తెలపని పరిస్థితి నెలకొంది.

వేములలో..

వేముల : వేములలో 144 సెక్షన్ అమలులో ఉండడంతో బంద్ ప్రభావం లేకుండా పోయింది. మండల కేంద్రంలో దుకాణాలు, పాఠశాలలు, వ్యాపార సంస్థలు యథావిధిగా కొనసాగాయి. ఆర్టీసీ బస్సులు నడపడంతో ప్రయాణికులకు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. బంద్‌లో టీడీపీ కార్యకర్తలు పాల్గొనకపోవడంతో బంద్ ఊసే లేదు.

పోలీసుల అదుపులో టీడీపీ నాయకులు

వేంపల్లె : వేంపల్లె మండలంలో టీడీపీ నాయకులు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తారని సమాచారం రావడంతో పలువురిని అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు బంద్, ర్యాలీ నిర్వహించాలని సిద్ధంగా ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. సాయంత్రం 5గంటల వరకు వారిని పోలీస్ స్టేషన్‌లో ఉంచి ఆ తర్వాత వదిలేశారు.

జమ్మలమడుగులో బంద్ ప్రభావం అంతంతే

జమ్మలమడుగు : పట్టణంలో బంద్ ప్రభావం అంతంతమాత్రంగా కనిపించింది. ఉదయం టీడీపీ ఇన్‌చార్జి సుబ్బరామిరెడ్డి కార్యకర్తలతో కలిసి దుకాణాలు మూయించారు. ఆ తర్వాత కొద్దిసేపటికి దుకాణాలు తెరచి తమ వ్యాపారాలను కొనసాగించారు. పట్టణంలో ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు మాత్రం స్వచ్ఛందంగా మూసేశారు.



పులివెందులలో తెరుచుకున్న దుకాణాలు



లింగాల మీదుగా ధర్మవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు



పాత బస్టాండ్‌లో తిరుగుతున్న ఆర్టీసీ బస్సులు

చంద్రబాబు పాపం పండింది



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : చంద్రబాబు తన పాలన కాలంలో చేసిన దోపిడికి ఇన్నేళ్ల తర్వాత పాపం పండి న్యాయం గెలిచిందని ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం నూతన ఎర్రగుంట్ల మున్సిపల్ భవనంలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో దోపిడీ చేసి డబ్బును కొల్లగొట్టిన కేసులో కోర్టు బోను ఎక్కారన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబును అరెస్టు చేయడం సమంజసమేనన్నారు. ఈ సమావేశంలో కో–ఆప్షన్ సభ్యుడు డి.సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్ మహమ్మద్‌ఆలీ, 1 ,14వ వార్డుల ఇన్‌చార్జిలు ప్రశాంత్, షాహిద్ పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య, తదితరులు

పులివెందుల రూరల్ : ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య అన్నారు. సోమవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బయమ్మతోట, యర్రగుడిపల్లి, జెండామాను వీధి ప్రాంతాల్లో ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జ్వరాలు వచ్చిన వెంటనే పులివెందుల ఏరియా ఆసుపత్రిలో రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారాలు లేకుండా, మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. ఎయిర్‌కూలర్‌లోని నీటిని వారానికి ఒకసారి శుభ్రం చేయాలన్నారు. వాడిన వస్తువులను ఇంటిపైన కానీ, ఇంటి పరిసరాలలో లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలన్నారు. అనంతరం దోమలు వృద్ధిచెందకుండా, వ్యాధులు రాకుండా ఉండాలని కరపత్రాలు పంపిణీ చేసి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు నాగమణి, సోమేశ్వరి, ఆశాకార్యకర్తలు మాధవి, రాజమ్మ, అన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం రిలే నిరాహార దీక్షలు



ఎస్సీ వర్గీకరణ దీక్షలకు మద్దతు తెలుపుతున్న సింగరయ్య

జమ్మలమడుగు: పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. సోమవారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నయ్య మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు దాటినా ఇంత వరకు ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం దారుణం అన్నారు. ఈ దీక్షలకు మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



'గడప గడపకు మన ప్రభుత్వం'లో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సంక్షేమ పథకాలను క్యాలెండర్ ద్వారా గడప గడపకు అందించడం జరిగిందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక 48 వ డివిజన్‌లోని రామరాజుపల్లెలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందిన లబ్ధి సమాచారంతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వంకర సుజాత అనే మహిళ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నావడ్డీ, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా తమ కుటుంబానికి రూ.10,82,000 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. సి. రాధ అనే మహిళ తనకు వైఎస్సార్ సున్నావడ్డీ, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ పంటల బీమా, రైతు భరోసా, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ. 10 లక్షల 5వేల లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసి మా కుటుంబం అంతా సంతోషంగా ఉన్నామన్నారు. మా చల్లని దీవెనలతో ఇలాంటి ముఖ్యమంత్రి కలకాలం ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, శ్రీరంజన్‌రెడ్డి, తోటక్రిష్ణ, షఫీ, సుబ్బారెడ్డి, మధు, కె. కొండయ్య, పవర్ అల్తాఫ్, రామ్మోహన్‌రెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, సుశీలమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాబు అరెస్టుపై పవన్ కల్యాణ్ ఓవర్ యాక్షన్



మాట్లాడుతున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సీఐడీ అరెస్ట్ చేయడంపై దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ ఓవర్ యాక్షన్ చేశారని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యువతీ యువకుల ఉపాధి శిక్షణ కోసం వినియోగించాల్సిన నిధులను తన జేబులోకి మళ్లించుకున్న చంద్రబాబును అరెస్ట్ చేస్తుంటే లోకేష్ కంటే పవన్‌కళ్యాణ్ ఎక్కువ హంగామా చేశారన్నారు. ప్యాకేజీ తీసుకున్న విశ్వాసంతో రోడ్లపై పొర్లుతున్నాడని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ ఒక పార్టీకి అధ్యక్షుడా లేక టీడీపీ కార్యకర్తనా తెలపాలన్నారు. టీడీపీ కార్యకర్తలెవరూ చేయనివిధంగా పవన్ చేసిన ఓవరాక్షన్ చూసి జనసైనికులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబు నిప్పు కాదు...తుప్పు అని ఈ స్కాంతో తేలిపోయిందన్నారు. 27 కేసుల్లో స్టేలు తెచ్చుకొని బయట తిరుగుతున్న చంద్రబాబుకు స్కిల్డ్ స్కాంలో ఎండ్ కార్డ్ పడిందన్నారు. షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి వాటి ద్వారా నిధులను తమ ఖాతాలకు మళ్లించుకున్నారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు త్యాగరాజు, చిట్టిబాబు, కంచుపాటి బాబు, మనోజ్ పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు

ప్రొద్దుటూరు : వర్క్ షాప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు తెలిపారు. స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్‌షాపులు అన్ని విభాగాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సర్టిఫికెట్ కోర్సులు విద్యార్థులకు భవిష్యత్తులో ఉద్యోగాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీ ఉపయోగాలను వివరించారు. కన్వీనర్ ఎస్.హరినాథరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు దోహదపడతాయని తెలిపారు. జిందాల్ స్టీల్ ఇండస్ట్రీ డిప్యూటీ మేనేజర్ రవితేజ, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ రీసోర్స్ పర్సన్ డాక్టర్ రమేష్, కళాశాల డీన్ ఆచార్య కేవీ రమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు తొండూరుకు ఎంపీ రాక

తొండూరు : కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి మంగళవారం తొండూరుకు రానున్నట్లు వైఎస్సార్సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

రేపటి నుంచి మండల క్రీడాపోటీలు

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సత్రంబడి) మైదానంలో పులివెందుల మండల క్రీడాపోటీలను 13, 14వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బండి వీరారెడ్డి, మండల కోఆర్డినేటర్లు శ్రీధర్‌రెడ్డి, నాగూరు బాషాలు ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర విభాగానికి సంబంధించి 13వ తేదీన, 14న బాలికల విభాగానికి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్, యోగా క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులను నియోజకవర్గస్థాయి పోటీలలో పాల్గొనేందుకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు 9398486884, 9490550933 నంబర్లను సంప్రదించాలన్నారు.

14 నుంచి ఎస్‌జీఎఫ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో ఈనెల 14 నుంచి కడప మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాఎంపికలు నిర్వహిస్తున్నట్లు కడప ఎంఈఓ పాలెం నారాయణ, ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ బి. నిత్యప్రభాకర్ తెలిపారు. 14వ తేదీ వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, 15 కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, 16వ తేదీన టెన్నికాయిట్, యోగ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున పైన తెలిపిన తేదీల్లో క్రీడాకారులను ఎంపికలకు తీసుకురావాలని సూచించారు.

14న వైవీయూలో గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్, ఫైన్ ఆర్ట్స్ (పెయింటింగ్, స్కల్ప్చర్), ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో పీజీ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. పీహెచ్‌డీ, యూజీసీ నెట్, సీఎస్ఐఆర్ నెట్, జీఆర్ఎఫ్, ఏపీ సెట్ లాంటి అదనపు అర్హతలు ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. 14వ తేదీ ఉదయం 10 గంటలకు అభ్యర్థులు అన్ని రకాల ఒరిజినల్ సర్టిఫికెట్లతో వైవీయూ పరిపాలన భవనంలో హాజరుకావాలని సూచించారు.

సబ్సిడీ ఉలవలు పంపిణీ

వీరబల్లె (రాయచోటి టౌన్) : ఖరీఫ్‌లో సాగుచేయని రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలు అందజేస్తున్నట్లు వీరబల్లె మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి వీరనాగిరెడ్డి తెలిపారు. సోమవారం ప్రభుత్వం అందించిన సబ్సిడీ ఉలవలను ఆయన ఏఓ స్వామి ఆధ్వర్యంలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు వీరబల్లె మండలానికి 295 క్వింటాళ్ల ఉలవలు వచ్చాయని చెప్పారు. తక్కువ వర్షపాతానికి ఉలవలు పండించుకోవచ్చన్నారు. అందువల్లనే ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో వీటిని సరఫరా చేస్తోందని పేర్కొన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకొని సాగు చేయాలని సూచించారు.

జగనన్న ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు



లబ్ధిదారులకు జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : జగనన్న ప్రభుత్వంలోనే ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందాయని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక జెండామానువీధిలోని పలు ప్రాంతాల్లో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. ముందుగా జెండామానువీధిలోని పోలిమేర పోలేరమ్మ ఆలయంలో టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇందిరా నగర్, జెండామానువీధి ప్రాంతాల్లో గడపగడపకు వెళ్లి ప్రతి ఒక్క కుటుంబాన్ని పలకరించారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలులను, అందిన పథకాలను వివరించారు. ఇంకా ఎవరికైనా పథకాలు అందకపోతే తెలియజేయాలన్నారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు అండగా నిలవాలని ప్రజలను కోరారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సలీమా, ఖాదర్‌బాషా, పార్నపల్లి కిశోర్, కోడిరమణ, మస్తాన్‌వలి, బలిజసంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓతూరు రసూల్, కృష్ణమూర్తి, కోళ్లభాస్కర్, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, సిద్ధయ్య, సోఫాల వీరా, రాజేష్ నాయుడు, సంపత్, జయ, హరి, నవీన్, విష్ణు, ప్రశాంత్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం నిర్వహించారు. మైలవరం మండలం దొమ్మరనంద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషియల్ ఉపాధ్యాయుడు కె. హరి మధుసూదనరావు ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాలలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో తోటి ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, భారతి దేవి, భాగ్యవతి భాయి, వాసంతి, చరణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓ దివాకర్

ప్రొద్దుటూరు క్రైం : విధి నిర్వహణలో అమరులైన అటవీ అధికారుల త్యాగాలు చిరస్మరణీయమని ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓ ఎస్‌వీ దివాకర్ తెలిపారు. పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో సోమవారం అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్ఓ ఎస్ వీ దివాకర్, సిబ్బంది అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం సబ్ డీఎఫ్ఓ మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడే క్రమంలో దేశవ్యాప్తంగా ఎందరో అటవీ ఉద్యోగులు అమరులయ్యారన్నారు. దేశంలోనే అరుదైన ఎర్రచందనం మన ప్రాంతంలో అధికంగా ఉందన్నారు. ఈ అటవీ సంపదను అక్రమార్కుల బారి నుంచి కాపాడే క్రమంలో అనేక మంది అటవీ అధికారులు మృతి చెందారని తెలిపారు. అంతేగాక వన్య ప్రాణుల చేతిలో కూడా ప్రతి ఏటా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అమర వీరుల త్యాగాలు మరువలేనివని ఆయన తెలిపారు. అమర వీరుల స్ఫూర్తితో మనందరం పని చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రవిచంద్ర, ప్రొద్దుటూరు రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీశాఖ అమరవీరులకు సోమవారం స్థానిక ఫారెస్టు కార్యాలయలంలో రేంజర్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో జాతి సంపద రక్షణలో అసువులు బాసిన అమరవీరులకు నివాళి అర్పించడం మన కర్తవ్యమన్నారు. వారి స్ఫూర్తితో, వారిని మార్గదర్శకంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ శ్రీకృష్ణ, సిబ్బంది రమణయ్య, శ్రీనివాసులు, కిశోర్, బ్రహ్మయ్య, వెంకటేష్, అంజి, సుభాషిణి, డాగ్ స్క్వాడ్ హసన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామంలోని అమ్మవారిశాల వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ట వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితుడు యేలేశ్వర గురస్వామి శర్మ వేద మంత్రాలతో అమ్మవారికి ప్రాతఃకాలపూజ, గురుపూజ, యంత్రస్థాపన, శిఖర స్థాపన, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం కమిటీ అధ్యక్షుడు బియ్యపు నరసింహ ప్రసాద్, కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు, యువత, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్

కడప కార్పొరేషన్ : గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో.. విజయవంతంగా నిర్వహించేందుకు గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ మీటింగ్ హాల్ లో గణేష్ ఉత్సవాల నిర్వహణ పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ... నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో గణేశ చతుర్థి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఆదేశించారు. అందు కోసం... అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలందరూ మట్టి విగ్రహాలను ఉపయోగించాలని ఆయన పిలుపునిచ్చారు. మత సామరస్యానికి ప్రతీకగా.. అన్ని మతాల ప్రజల సహకారంతో.. గణేష్ ఉత్సవాలలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉత్సవాలు జరిగేలా చూడాలన్నారు. నిమజ్జనం మార్గంలో కరెంట్ తీగలు, కేబుల్ వైర్ లు అడ్డు రాకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీరు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రాంతాల్లో క్రేన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అలాగే.. అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గణేష్ ఉత్సవాలకు సంబంధించి.. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే.. వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. వినాయక ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్ శాఖ ఇచ్చే సూచనలను తప్పక పాటించాలన్నారు. నిమజ్జనం పాయింట్ వద్ద గజ ఈత గాళ్లను, అలాగే అగ్నిమాపకశాఖ సిబ్బందిని ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తి భావంతో జరుపుకునేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, శాంతిభద్రతలకు, మతసామరస్యానికి ఇబ్బంది కలగకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించాలన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన నియమ నిబంధనలను ఉత్సవ కమిటీ సభ్యులు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని.. శాంతి కమిటీ సభ్యులను ఆయన కోరారు. ఈ సమావేశంలో డీఎస్పీ షరీఫ్, ఆర్డీవో ధర్మ చంద్రా రెడ్డి లు, పోలీసు అధికారులు, గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ అధ్యక్షుడు మునగా సతీష్, జనరల్ సెక్రటరీ కే.వి లక్ష్మినారాయణ రెడ్డి, వి. శ్రీనివాసులు, శాంతి కమిటీ సభ్యులు లక్ష్మణ్ రావు, బాలకష్ణ యాదవ్, రామ్ మహేష్ ,పి మహేష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.